క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా రాజమాతనగర్, నిడమానూరు రోడ్డు, పద్మనాభపురం, గిరిజాపురం కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

కానూరులో..

మురళీనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కానూరులోని వినాయక్‌నగర్, నవతారోడ్డు, కేసీపీ పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో నూర్‌బాషాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కంకిపాడు: నామినేటెడ్ పదవుల భర్తీలో నూర్‌బాషాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు తెనాలిలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం కంకిపాడులో చిన్నా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది నూర్‌బాషా ముస్లిం జనాభా ఉందన్నారు. నామినేటెడ్ పదవుల్లో ప్రభుత్వం నూర్‌బాషాలకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నూర్‌బాషాల ఉన్నతికి చర్యలు తీసుకోవాలని మంత్రి మనోహర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా శాకంబరీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను, ఇతర దేవతామూర్తులను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. తొలుత స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులచే శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. శాకంబరీ అలంకరలో ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

కంకిపాడు: ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. ఈడుపుగల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని పుప్పాల హారిక ఉన్నత చదువులకు కంకిపాడుకు చెందిన యలమంచిలి భార్గవ్ రామ్ రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థినికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీ–4 కార్యక్రమం ద్వారా గుర్తించిన పేదల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో బోడె వెంకటరామ్, యలమంచిలి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఆత్మీయ సమ్మేళనం



పెనమలూరు: పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం యాదవుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని ప్రసంగించారు. బీసీలకు అండగా టీడీపీ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. యాదవులు ఐక్యతతో ఉండి వ్యాపారాలు, రాజకీయాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. టీడీపీలో నేడు యాదవులకు అనేక పదవులు లభించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథిని యాదవ సమాజం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీ పూర్ణచందుకు సాహితీ పురస్కారం

విజయవాడ కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందుకు విశాలాక్షి సాహితీ పురస్కారం లభించింది. విశాలాక్షి సాహిత్య పత్రిక వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు పురమందిరంలో ఆదివారం జరిగిన సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు. సాహిత్యరంగంలో విశేషమైన సేవలను అందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. పురస్కారగ్రహీత జీవీ పూర్ణచందు మాట్లాడుతూ తెలుగుభాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, విశాలాక్షి సాహిత్య పత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, ఆనం రమణారెడ్డి, కోసూరు రత్నం పూర్ణచందును అభినందించారు.

సమస్యల వలయంలో సరస్వతీ నిలయం

- అభివృద్ధికి దూరంగా ముస్తాబాద జెడ్పీ హైస్కూల్
- అధ్వానంగా క్రీడా మైదానం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఉత్తరం వైపు ప్రహరీ లేని పాఠశాల స్థలం



ముస్తాబాద జెడ్పీ హైస్కూల్

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి దూరంగా ఉంది. ఈ హైస్కూల్‌లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 304 మంది వరకూ విద్యార్థులు చదువుతున్నారు. వీరందరూ ముస్తాబాద, సావరగూడెం, సూరంపల్లి, పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల నుంచి హైస్కూల్‌కు వస్తుంటారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అవస్థలు

సావరగూడెం నుంచి విద్యార్థులు హైస్కూల్‌కు రావాలంటే నాలుగు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాలు కూడా హైస్కూల్‌కు దూరంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత గంటన్నర లేటుగా బస్సులు వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం ఆర్టీసీ డిపో యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచక ఆక్రమణకు గురవుతున్న పాఠశాల క్రీడా మైదానం

ఆక్రమణలో హైస్కూల్ స్థలం

జెడ్పీ హైస్కూల్‌కు దాతలు 1950వ దశకంలో ఐదు ఎకరాలకు పైగా భూమి సమకూర్చారు. అయితే రోడ్డు వెంట భవన నిర్మాణాలను, షెడ్లు నిర్మించారు. మిగిలిన భూమి పెద చెరువు ముంపునకు గురిఅవుతుంది. దీనిని సర్వే చేసి రక్షించాలని పూర్వ విద్యార్థులు ఎంతో కాలంగా కోరుతున్నారు. అయినా చర్యలు మాత్రం శూన్యం. అలాగే పాఠశాల కొత్త బిల్డింగ్ ఉత్తరం వైపు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతం చెరువు ప్రదేశం కావడంతో బాగా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో విష పురుగులు తిరుగుతున్నాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

మౌలిక వసతులు కరువు

మెట్ట ప్రాంత గ్రామాల్లో ఉన్న ఒకే మేజర్ పంచాయతీ ముస్తాబాద. అటువంటి ముస్తాబాదలో 1950లో నిర్మించిన హైస్కూల్ అభివృద్ధి పట్ల చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే విధంగా పాఠశాల క్రీడా మైదానం అధ్వాన దుస్థితిలో ఉంది. విద్యార్థుల మనో వికాసానికి ఉపయోగపడే ఆట స్థలం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా మన బడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా మిగిలిన మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ ఎంతో విశిష్టత సాధించింది. పూర్వ విద్యార్థులు ఈ పాఠశాలకు వెన్నుదన్నుగా ఉన్నారు. మెట్ట ప్రాంత గ్రామంలో గడచిన 70ఏళ్లకు పైగా విద్యనందిస్తున్న ఈ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

– మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి

ప్రహరీ లేదు



ఎంతో మందిని ఉన్నతంగా తీర్చిదిద్దిన పాఠశాల ఇది. ఎంతో మందికి విద్యనందిస్తున్న ఈ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి. అలాగే క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి. ఆక్రమణలు తొలగించి పాఠశాల స్థలం కాపాడాలి.

– షేక్ బాజీ, ముస్తాబాద

కరాటేతో ఆత్మస్థైర్యం



ఉయ్యూరు: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని సీఐ రామారావు పేర్కొన్నారు. స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్దార్థ కళాశాలలో నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్ట్, గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను సీఐ రామారావు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాటలు, క్రీడలు, కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటివి కూడా అవసరమన్నారు. కరాటే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

అన్నేకు సత్కారం



పెనమలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాల కృష్ణమూర్తిని పార్టీ నేతలు ఆదివారం కానూరులో ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆయనను పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడిగా నియమించింది. ఈ నేపథ్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నాయకుడు పిడికిటి రామకోటేశ్వరరావు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, సీనియర్ నాయకులు కర్రా ఆదిశేషారావు, గురజారవి, మరీదు శ్రీనివాసరావు, యువజన విభాగం నాయకుడు గుమ్మడి అన్వేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఆడి కృత్తిక మహోత్సవం

విజయవాడ కల్చరల్: నగరంలోని కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సవాన్ని వేద పండితులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు కావడి సేవలో పాల్గొన్నారు. దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ కృత్తిక మహోత్సవం సందర్భంగా అన్ని సుబ్రహ్మణ్యస్వామి దేవాయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారని, సంతానం లేని వారు కావాడి సేవలో పాల్గొనడం వల్ల సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు.

వక్ఫ్ భూముల్లో అక్రమంగా ప్రవేశించిన వారిపై ఫిర్యాదు

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో వక్ఫ్ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి సాగుకు యత్నించిన పలువురు వ్యక్తులపై వక్ఫ్ బోర్డు అధికారులు, కొండపల్లి ఖాజీ తహసీల్దార్ గోపాలకృష్ణకు ఆదివారం ఫిర్యాదు చేశారు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండీ నాహూ ఆలీషా, కొండపల్లి ఖాజీ హుస్సేనీ, జూనియర్ అసిస్టెంట్ కరీముల్లా తన ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ.. తహసీల్దార్ ఇటీవల వక్ఫ్ భూములకు కౌలు వేలంపాట నిర్వహించారన్నారు. హైకోర్టు తుది ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులు చట్ట విరుద్ధంగా వక్ఫ్ భూముల్లోకి తరచుగా ప్రవేశిస్తున్నారని తెలిపారు. కాగా ఆదివారం తాడిగడపలో వక్ఫ్ భూముల వద్ద విధుల్లో ఉన్న వక్ఫ్ జూనియర్ అసిస్టెంట్ కరీముల్లాను చోడవరంకు చెందిన టి.శ్రీనివాసరావు అతనికి చెందిన వ్యక్తులు బెదిరించి అంతుచూస్తామని విధులను అడ్డుకున్నారని తెలిపారు. వక్ఫ్ భూములను పర్యవేక్షిస్తున్న సమయంలో టి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, మరో ఏడుగురు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడ్డారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వక్ఫ్ అధికారులను బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



పెదపులిపాక గ్రామం వక్ఫ్ భూముల వద్ద హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ దోపిడీ

గన్నవరం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగి ఉందని ప్రజా వేదిక రాష్ట్ర నాయకుడు చిగురుపాటి బాబురావు పేర్కొన్నారు. స్థానిక ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో ఆదివారం ప్రజావేదిక ఆధ్వర్యాన 'స్మార్ట్ మీటర్లు వద్దు – ట్రూ అప్ చార్జీలు రద్దు' కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి అదానీకి అప్పగించేందుకు పాలకులు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగా అదానీ కంపెనీ కోటి స్మార్ట్ మీటర్లను తయారు చేస్తుందన్నారు. మొదటి విడతగా వ్యాపార, వాణిజ్య సముదాయాలకు 45 వేల స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే పెరిగిన కరెంట్ బిల్లులతో సతమతమవుతున్న ప్రజలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ద్వారా మరింత భారం పడుతుందని పేర్కొన్నారు.

మరో విద్యుత్ ఉద్యమం తప్పదు

ప్రజావేదిక రాష్ట్ర నాయకుడు సయ్యద్ అప్సర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టించే పనిలో నిమగ్నమవడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా జరిగే దోపిడీని అడ్డుకునేందుకు మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని, అందులో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని తెలిపారు. ప్రజావేదిక నాయకులు గన్నె వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు, గొంది శోభనం, బుద్దవరం సర్పంచి బడుగు, బాలమ్మ, సీపీఎం, సీపీఐ నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ రామచంద్రజోషి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బాబురావు

పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లుగా నియమితులైన బేబి సుజాత (ఆరుగొలను), దన్నె దుర్గారావు (కానుమోలు), కొల్లి వెంకట లక్ష్మీనారాయణ (కొయ్యూరు), ఆవిర్నేని భవానీశంకర్ (వేలేరు), షాన్ బాషా (మల్లవల్లి), పిడికిటి రాంబాబు (మడిచర్ల), కనకవల్లి శేషగిరి రావు (రంగన్నగూడెం), కలపాల వెంకట శివ ప్రసాద్ (వీరవల్లి)ల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం బాపులపాడు మండలం వేలేరులో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ సహకార సొసైటీల బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్, హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు. అనంతకు ముందు స్థానిక ఏలూరురోడ్డులోని ఎస్వీ కల్యాణ మండలంలో జనసేన పార్టీ తరుపున పీఏసీఎస్ చైర్మన్లుగా నియమితులైన వడ్డీ శివనాగేశ్వరరావు (బాపులపాడు), వడ్డి అశోక్‌కుమార్ (కొత్తపల్లి), యజ్జవరపు శ్రీనివాసరావు (దంటగుంట్ల), బెజవాడ వాసు (బిళ్లనపల్లి)ల ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే యార్లగడ్డతో పాటుగా ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు హాజరయ్యారు.



త్రిసభ్య కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ఉయ్యూరు పీఏసీఎస్ చైర్మన్‌గా వాసు

ఉయ్యూరు: ఉయ్యూరు పీఏసీఎస్ చైర్మన్‌గా కూనపరెడ్డి శ్రీనివాసరావు (వాసు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ సమక్షంలో సొసైటీ కార్యాలయంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్ జంపాన పూలా, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు జంపాన గుర్నాధరరావు, వెనిగళ్ల వెంకట కుటుంబరావు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



వర్షంనీరుతో నిండిన కానూరు ప్రధాన రహదారి

- చిన్న వర్షానికే జలమయం అవుతున్న కానూరు ప్రధాన రహదారి
- కూటమి పాలనలో రోడ్డు అధ్వానం

పెనమలూరు: కూటమి పాలనలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రధాన రహదారి ప్రజలపాలిట శాపంగా మారింది. చినుకు పడితే చాలు గ్రామ రహదారిపై మురుగు నీరు చేరి దారుణమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి రాగానే సంక్రాంతి పండుగ నాటికి రహదారులు అద్దంలా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికారు. అయితే కూటమి అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా కానూరు రహదారికి మాత్రం మోక్షం రాలేదు. వర్షం చినుకు పడితే కానూరు ప్రధాన రహదారి చిత్తడిగా మారుతోంది. ఎక్కడా లేని మురుగునీరు వచ్చి ఈ ప్రధాన రహదారిపై నిలిచిపోతుంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

హడావుడి చేసి ఫొటోలకు ఫోజులిచ్చి

ఎన్నికలు ముగిసిన తర్వాత కానూరు ప్రధాన రహదారిని మరమ్మతులు చేయడానికి కూటమి నేతలు హడావుడి చేసి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. రోడ్డుపై అక్కడక్కడ ప్యాచ్ వర్కు చేసి వదిలేశారు. కనీసం డ్రెయినేజీల నిర్మాణం కూడా చేయలేదు. ఎన్నికల ముందు వరకు కానూరు అభివృద్ధి గురించి జపించిన కూటమి నేతలు ఎన్నికల తర్వాత ఊసెత్తడంలేదు. వైఎస్సార్ సీపీ పాలనలో రోడ్లపై విమర్శలు చేసిన కూటమి నేతలు అధికారం చేపట్టిన తర్వాత కానూరు గ్రామంలో అభివృద్ధి చేయాల్సిన పనులను అటకెక్కించారు.

కూటమి నేతల వింత పోకడ

తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వింత పోకడగా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాధాన్యత కలిగిన పనులు చేయకుండా కూటమి నేతలు వారి వారి అవసరాల మేరకు మాత్రమే పనులు చేసి బిల్లులు విత్‌డ్రా చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కానూరు ప్రధాన రహదారి సమస్య చాలా తీవ్రంగా ఉండగా, కూటమి నేతలు ఓటు బ్యాంక్ రాజకీయం కోసం వారి మద్దతుదారులు ఉన్న ప్రాంతాల్లోనే పనులు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కానూరు డ్రెయినేజీ వదిలేసి పోరంకిలో జాతీయ రహదారి పక్కన డ్రెయిన్‌ను అత్యవసరంగా ఎందుకు నిర్మిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీకి అనుకూలమైన వారు ఉన్న ప్రాంతాల్లోనే పనులు జరుగుతున్నాయని, జనాలు రద్దీగా తిరిగే రోడ్లను, డ్రెయినేజీలను వదిలేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాఢ సారె



కనకదుర్గమ్మకు ఆషాఢ సారెను తీసుకువస్తున్న బ్రాహ్మణ పరిషత్ మహిళలు



అంకమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు



బాపులపాడులో ఊరేగింపుగా గంగానమ్మకు ఆషాఢ సారె తీసుకువెళ్తున్న మహిళలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత బ్రాహ్మణ పరిషత్‌కు చెందిన మహిళలు సారెతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం శ్రీకనకదుర్గమ్మ భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, కమిటీ సభ్యులు కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, గోపరాజు సత్యపవన్‌కుమార్, మామిళ్ళపల్లి నాగసుబ్బారావు, తిమ్మరాజు వెంకటసుబ్బారావు, సరస్వతుల వెంకట ఆదిత్య, స్వర్ణ చంద్రశేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి బోనాలు

స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఉపదేవత అంకమ్మతల్లికి ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు బోనాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీతిరుపతమ్మ మాతృ మండలి సభ్యులచే అంకమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యనమలకుదురులో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులో గ్రామ దేవత గంగానమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామ ప్రముఖులు గూడవల్లి చిన్నా, ప్రసాదరావు, రత్నశేఖర్, యడవల్లి పాండురంగారావు, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారికి ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం ఆశాఢ సారె సమర్పించారు. శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాల స్వామివారి ఆలయం వద్ద నుంచి ఆర్యవైశ్య సంఘం, భక్తులు మేళతాళాలతో వచ్చి శ్రీకనకదుర్గ అమ్మవారికి పూలు, పండ్లు, స్వీట్లతో ఆశాఢ సారె సమర్పించారు.

భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బుద్దా లక్ష్మణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భావజాలం స్ఫూర్తిదాయకం



విజయవాడ కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలం స్ఫూర్తిదాయకమని కళాపోషకుడు దుద్దిళ్ళపాటి గోపాలకృష్ణసాయి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక – సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం అంబేడ్కర్ స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలకృష్ణసాయి మాట్లాడుతూ భారత జాతి గర్వించతగిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రోగ్రాం కన్వీనర్ బీవీ వీరభద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా సంస్థ ద్వారా యువతను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగస్థల నటుడు అశోక్ ఆనంద్ మాట్లాడుతూ సినీ సంగీత విభావరిలో ట్రాక్ మీద కాక ఆర్కెస్ట్రా మీద నిర్వహించాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు కే డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ, మారేపల్లి జోషి, యూవీ రత్నం, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.